క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా



డిగ్రీ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 30 ఏళ్లుగా ఇక్కడ కొనసాగుతున్న ఈ డిగ్రీ కళాశాలను సిరిసిల్లకు తరలించాలని తీసుకున్న నిర్ణయాలను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కళాశాలలో ఎందరో విద్యార్థులు విద్యనభ్యసించి మేధావులుగా ఉన్నారని, అలాంటి కళాశాలను ఇక్కడి నుంచి తరలించవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాము, సంజీవ్, వేణు, జావేద్, అరవింద్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ స్థితిగతులపై అవగాహన



చిత్రపటం వేసి వివరిస్తున్న విద్యార్థులు

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో మంగళవారం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయ స్థితిగతులపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి సంబంధించిన పంటలు, నేలల్లో రకాలు, సాగు వనరులు, పంట దిగుబడులు మొదలగు అంశాలపై చిత్రపటాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ ప్రియదర్శిణి, డీఏఏటీటీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కే మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచు బూర్గుల నందయ్య, ఉపసర్పంచ్ మేడిద మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి షబానా సుల్తానా, రైతు సంఘం అధ్యక్షుడు కూస రవీందర్, విద్యార్థినులు అఫ్రిన్, అపూర్వ, లక్ష్మి, ప్రియ, అలిత సాయి పాల్గొన్నారు.

ఇన్నోవేటర్‌లో ప్రతిభచూపిన విద్యార్థికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వేములవాడరూరల్: ఇంటింటా ఇన్నోవేటర్‌లో ప్రతిభ చూపిన వేములవాడ పరిధిలో అగ్రహారం పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థిని ఎస్.పూజను కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ అభినందించారు. ఎలక్ట్రికల్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్న పూజ మహిళా రక్షణ కోసం హెయిర్ రబ్బర్ బ్యాండ్‌ను ఆవిష్కరించడంతో ఉపాధ్యాయ బందం అభినందించారు. మహిళలు ప్రమాదంలో ఉన్నప్పుడు ఈ రబ్బర్‌బ్యాండ్‌ను నొక్కితే పోలీస్ హారన్ వస్తుందన్నారు. కళాశాల అధ్యాపక బందం ఉన్నారు.

పరిహారం.. పరిహాసం

- వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- పరిహారం కోసం అన్నదాతల పడిగాపులు
- నాలుగు నెలలైన అందని పరిహారం



ముస్తాబాద్: అకాల వర్షాలు.. వడగండ్లతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామన్న ప్రభుత్వ హామీ అమలు కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. రబీ సీజన్‌లో అకాల వర్షాలు, వడగండ్ల వానతో వరి పంట తీవ్రంగా దెబ్బతింది. వందలాది ఎకరాల్లో పంటను రైతులు నష్టపోయారు. పెట్టుబడులు మీద పడి నష్టాలను చవిచూసిన రైతులకు పరిహారం ఇస్తామన్న అధికారుల హామీ అమలుకు నోచుకోవడం లేదు. నెలలు గడిచిన నయా పైసా రాకపోవడంతో చేసేది లేక వానాకాలం పంటలకు సిద్ధమయ్యారు. ముస్తాబాద్ మండలంలో ఏప్రిల్‌లో భారీ వడగండ్లు, వర్షాలకు 610 ఎకరాలలో వరి పంట, మరో 50 ఎకరాల్లో పత్తిపంట దెబ్బతింది.

చేతికొచ్చిన పంట రాలిపోయింది

ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, గూడెం, రామలక్ష్మణపల్లె, నామాపూర్, తెర్లుమద్ది, కొండాపూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. అప్పుడే వరి పొట్టదశలో ఉండగా, కొన్ని గ్రామాల్లో కోతకు వచ్చింది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలు, వడగండ్లు రైతులకు కడగండ్లే మిగిల్చాయి. కళ్లేదుటే ధాన్యం రాలిపోతుంటే దీనంగా చూస్తు ఉండిపోయారు. ధాన్యం రాలిపోగా, పొట్ట దశలో ఉన్న వరి పంట తెల్లగా మారిపోయింది. ధాన్యం సొట్టలు పడి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. 50 శాతానికి పైగా వరి పంట దెబ్బతింది. అయితే అధికారులు నిబంధనల మేరకు 610 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు సర్వేల్లో తేల్చారు.



పోతుగల్ ఏఎంసీలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు(ఫైల్)

పరిహారం వస్తుందన్న ఆశతో..

దెబ్బతిన్న వరి పంటకు ఎకరానికి రూ.10 వేల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతన్నల్లో ఆశలు చిగురించాయి. కనీసం పెట్టుబడులకైనా పరిహారం వస్తుందని ఆశించారు. ఏప్రిల్‌లో కురిసిన వడగండ్లతో భారీగా దిగుబడులు తగ్గి, అప్పులు ఉన్న రైతాంగానికి ప్రభుత్వ ప్రకటన ఆశలు రేపింది. క్షేత్రస్థాయిలో ఏఈవోలు పకడ్బందీగా చేపట్టిన సర్వేలు, సేకరించిన ఆధారాలు, బ్యాంక్ జిరాక్స్‌లు, పట్టాదారు పాస్‌బుక్కుల జిరాక్స్‌లతో పరిహారం వస్తుందని భావించారు. బ్యాంక్ ఖాతాలను వారం రోజులకొకసారి చూసుకోవడం, నిరాశగా వెనుదిరగడం జరుగుతుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మార్చిలో కురిసిన వానలకు మాత్రమే పరిహారం వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. ఆ సమయంలో కనీసం పది ఎకరాలు కూడా నష్టం జరగలేదని, ఏప్రిల్‌లో కురిసిన వడగండ్లతో భారీ నష్టం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు.

పెట్టుబడులు మీద పడ్డాయి

వరి పంట సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టామని అంటున్నారు. ఎకరాకు ట్రాక్టర్‌కు రూ.5 వేలు, నాటుకు రూ.5 వేలు, కలుపునకు రూ.5 వేలు, మందులు, యూరియా రూ.3 వేలు, గడ్డిమందుకు రూ.వెయ్యి ఖర్చు చేశారు. వడగండ్లతో ఎకరాకు కనీసం పది బస్తాలు కూడా రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.10 వేల పరిహారం వస్తే పెట్టుబడులైన దక్కుతాయని ఆశిస్తున్నారు. రబీపోయి, వానకాలం పంటలు వేసిన పరిహారం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు ఎకరాల్లో వరి దెబ్బతింది



నాకు ఐదు ఎకరాలు ఉంది. మూడు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో పత్తి వేసిన. వడగండ్లు కురిసి వరి, పత్తి దెబ్బతిన్నాయి. మూడు ఎకరాల్లో 90 బస్తాలు రావాల్సిన ధాన్యం 30 బస్తాలు కూడా రాలేదు. మూడు ఎకరాలకు రూ.75 వేలు ఖర్చు అయ్యాయి. ఎకరానికి ఇచ్చే పరిహారం వస్తే మంచిగుండు.

– పుట్ట చంద్రయ్య, రైతు, తెర్లుమద్ది

పరిహారం కోసం ఎదురుచూస్తున్నం



నాకు ముస్తాబాద్‌లో ఆరు ఎకరాలుంది. వడగండ్ల వాన కురిసి రెండు ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. సార్లు వచ్చి చూసి సర్వే చేసుకుని పోయిన్రు. నాకు నలభై వేల నష్టం జరిగింది. సార్లు ఎకరానికి పదివేలు ఇస్తామన్నారు. పరిహారం వస్తుందని ఎదురుచూస్తున్నం. మమ్మల్ని ఆదుకోవాలే.

– శాగ పెంటయ్య, రైతు, ముస్తాబాద్

ప్రతిపాదనలు పంపించాం



ఏప్రిల్‌లో కురిసిన భారీ వడగండ్లు, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. సర్వే పూర్తి చేశాం. నష్టపోయిన రైతుల వివరాలను అధికారులకు పంపించడం జరిగింది. పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అవుతుంది. మార్చిలో జరిగిన నష్టానికి ఇద్దరు రైతులకు పరిహారం వచ్చింది.

– వెంకటేశ్, ఏవో, ముస్తాబాద్

సమాచారం

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం ప్రెస్‌మీట్‌లో వివరాలను తెలియజేస్తామన్నారు.

నియామకం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా హమీద్

గంభీరావుపేట: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా హమీద్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హమీద్ నియామకం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా పర్శరాం

వేములవాడరూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా పండుగ పర్శరాం, రూరల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రొండి రా జును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలన్న, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు కనకయ్య నియామకపత్రాలను అందజేశారు.

బీఆర్ఎస్ దళితులను మోసం చేసింది



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వేములవాడ: దళితులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్ ఆరోపించారు. వేములవాడ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని పేర్కొన్నారు. దళితున్ని సీఎం చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మాట తప్పారని, ఇప్పుడు దళిత బంధు ఇస్తున్నామని చెబుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు రేగుల సంతోష్, బాబు, శ్రీనివాస్, హన్మాండ్లు, మహాకాళి శ్రీనివాస్, రాజ్‌కుమార్, కృష్ణ, వివేక్ రెడ్డి, ఏదుల అశోక్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

చందుర్తి: స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌దీక్షితులు, కన్వీనర్ ఎల్.విజయ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న అండర్–14,17 బాలికలు, 2న అండర్–14,17 బాలురలకు పోటీలుంటాయన్నారు.

బోయినపల్లిలో 4, 8వ తేదీల్లో..

బోయినపల్లి: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు సెప్టెంబర్ 4, 8వ తేదీల్లో స్థానిక హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్లు మండల ఎస్‌జీఎఫ్ఐ అధ్యక్షుడు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, కన్వీనర్ సీహెచ్.సంపత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు పీడీ సీహెచ్ సంపత్‌రావును 94406 39560లో సంప్రదించాలని కోరారు.

గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ

తంగళ్లపల్లి: గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని తంగళ్లపల్లి ఎంపీడీవో పి.లచ్చాలు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులుగా గుర్తించిన వారిని గుడిసె, కూలిపోయే ఇళ్లు, ఖాళీ స్థలం, రేకుల షెడ్డు ప్రాతిపదికన నోట్ కామ్‌లో ఫొటోతీసి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. కొత్త దరఖాస్తులు కూడా స్వీకరించి అర్హులైన వారిని వివరాలు కూడా ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని 15వ ఆర్థికసంఘం నిధుల వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, ఏపీవో రాపోల నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు ఉద్యమించాలి

సిరిసిల్లకల్చరల్: తెలుగు భాష పరిరక్షణకు ఉద్యమించాలని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్ అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమ్మ ఒడిలో నేర్చుకునే భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగు వాళ్లందరిపైనా ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్రతో పాటు గ్రాంథికంలో ఉన్న తెలుగు భాష నిత్య వ్యావహారికంగా మార్చిన ఘనత రామ్మూర్తిదన్నారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు సామల వివేకానంద్‌సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో తెలుగు బాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అంబటి శంకర్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అధ్యాపకుడిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

చందుర్తి: చందుర్తి ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31న రక్షాబంధన్

ఎల్లారెడ్డిపేట: ఈ నెల 31న గురువారం రోజున రక్షాబంధన్ జంధ్యాల పౌర్ణమి రాఖీ వేడుకలను జరుపుకోవాలని ఎల్లారెడ్డిపేట గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ రాచర్ల దయానంద్‌శర్మ మంగళవారం తెలిపారు.రాఖీ పండుగను ఎప్పుడు జరుపుకోవాలనే సందిగ్ధంలో ప్రజలుండగా గ్రామస్తులకు వేద పండితులు పండుగ నిర్వహణపై స్పష్టత ఇచ్చారు.స్వస్తి శ్రీ శోభాకృత నామ సంవత్సర నిజ శ్రావణ శుక్ల పౌర్ణమి గురువారం 31న యజ్ఞో పవీత ధారణ జంధ్యాలు వేసుకోవడం, రాఖీ ధరించడం మంచిదని దయానంద్‌శర్మ అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేకపాలన

సిరిసిల్లఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలనను అవలంభిస్తున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా అధికారంలో ఉండి ప్రజావ్యతిరేక పాలనను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరగబడి తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిందన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల సంబంధించి కరపత్రాలను, పోస్టుకార్డులను ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గడపగడపకు కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలరాజు, వెంగల అశోక్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరామర్శ

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: మాతృవియోగం కలిగిన రాచర్లగొల్లపల్లికి చెందిన పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తిని మంగళవారం టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పరామర్శించారు. అలాగే ఇటీవల మృతిచెందిన నర్సింహులపల్లె మాజీ సర్పంచ్ మంద నర్సయ్య కుటుంబాన్ని, జిల్లెల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అబ్బాడి అనిల్ రెడ్డికి పితృవియోగం కలగగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.



సంక్షిప్త వార్తలు

అనాథ ఆశ్రమ విద్యార్థులకు విరాళం

తంగళ్లపల్లి: మండలంలోని సరస్వతి ప్రైవేటు పాఠశాల విద్యార్థులు తమ గొప్ప మనసును చాటుకున్నారు. మంగళవారం గోదావరిఖనిలోని మదర్ థెరిసా అనాథ ఆశ్రమ విద్యార్థులకు రూ.25,410 విరాళం అందజేశారు. విరాళాల సేకరణలో కృషిచేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠశాలలో తెలుగు బాష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.శ్రీనివాస్ యాదవ్, మరిపిటి వెంకటేశ్, పద్మ, సుజాత, సుమలత, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ సబ్ రిజిస్ట్రార్‌గా సురేంద్రబాబు

వేములవాడ: వేములవాడ సబ్‌రిజిస్ట్రార్‌గా సురేంద్రబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇంతియాజుద్దీన్ హుస్నాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ

రుద్రంగి: రాష్ట్ర వ్యవసాయరంగ ప్రభుత్వ సలహాదారుగా నియమించబడ్డ వేములవాడ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్‌బాబును మంగళవారం ఎంపీపీ గంగం స్వరూపారాణి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీతో పాటు కోఆప్షన్ మెంబర్ జెమీలాబేగం, నాయకులు గంగం మహేశ్, పూదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెల్పర్లకు శిక్షణ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని రుద్రవరం గుర్రంవానిపల్లిలో నీటి పారిశుధ్యంపై హెల్పర్లకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఎస్ఈ రవీందర్, మిషన్ భగీరథ ఈఈ జానకి పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారం ప్రభుత్వ పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పూర్వ గవర్నర్ అనంతుల శివప్రసాద్ మంగళవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. సర్పంచ్ శంకర్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరు గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడం మూలంగా పట్టణంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేశారు. ఫలితంగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. మొదట ఉదయం 11 గంటల నుంచి నాలుగు గంటల పాటు కరెంట్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. ఏఈ ఇచ్చిన ప్రకటన మేరకు వినియోగదారులు విద్యుత్ కోతపై సంసిద్ధులు కాగా ఏఈ మరో ప్రకటన విడుదల చేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ రావడంలో ఆలస్యం జరిగినందున రాత్రి 8 గంటల వరకు కరెంట్ సరాఫరా ఉండదని ప్రకటించారు. దీంతో రైతులు, గృహ వినియోగదారులు అయోమయానికి గురయ్యారు.

రక్షాబంధన్ వేడుకలు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. బాలికలు అబ్బాయిలకు రాఖీలు కట్టారు. కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని శిశుమందిర్‌లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా చిన్నారులు వివిధ క్రీడల్లో పాల్గొని ఘనంగా నిర్వహించారు. ప్రధానాచార్యులు చిలుక గట్టు, పాఠశాల కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మధు పాల్గొన్నారు.

బోర్ మోటర్‌లు ప్రారంభం

వీర్నపల్లి: మండలం మద్దిమల్ల గ్రామంలో ముదిరాజ్ సంఘం, హనుమాన్ ఆలయం వద్ద నూతన బోర్ మోటర్లను ఎంపీపీ మాలోత్ భూల మంగళవారం స్థానిక సర్పంచ్ కనుకవ్వతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఆలయ వైస్ చైర్మన్ మ్యాకల శ్రీనివాస్, ఉప సర్పంచ్ లక్ష్మి, పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన సదస్సు

సిరిసిల్లఅర్బన్/సిరిసిల్లకల్చరల్: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. మంగళవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కును వినియోగించుకోవడం, ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి నర్సింహులు, తహసీల్దార్ షరీఫ్, భాగ్యలక్ష్మి, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యాలయంలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉమారాణి మాట్లాడుతూఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని, మీ ఇంట్లో 2018 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరు జాబితాలో పేరునమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించి గ్రామాల్లోని ప్రతి పోలింగ్‌స్టేషన్ పరిధిలో బూత్‌స్థాయి అధికారులు ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇంట్లో చనిపోయిన వారు ఉంటే ఓటరు జాబితా నుంచి తొలగించాలని, కొత్త ఓటరు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించాలన్నారు. మండలంలో 16 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, బీఎల్‌వోలు పోలింగ్ స్టేషన్ పరిధిలోనే అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. ఓటరు నమోదును సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



సిరిసిల్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

మర్రిపల్లిలో..

వేములవాడరూరల్: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుజాత సూచించారు. మండలంలోని మర్రిపల్లి కస్తూర్బా పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శకుంతల, జూనియర్ అసిస్టెంట్ బాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్సీ పెంపుపై సారథి కళాకారుల హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు 30 శాతం పీఆర్సీ పెంచుతున్నట్లు ప్రభుత్వ నిర్ణయంపై జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే రసమయి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కళాకారులు పోత్తూరి రాజు, గడ్డం శ్రీనివాస్, శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య, శ్రీధర్‌రెడ్డి, పొద్దుపోడుపు శంకర్, పర్శరాములు, సంజీవ్, గణేశ్, ఝాన్సీ, లావణ్య, శిరీష, కిన్నెర లావణ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి

ఎల్లారెడ్డిపేట: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి కోరారు. మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నూతన అధ్యక్షుడు లక్ష్మారెడ్డిలను సన్మానించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజునాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పాసులు పంపిణీ

సిరిసిల్లటౌన్: ప్రతిరోజు బస్సుల్లో జిల్లా కేంద్రానికి వచ్చిపోయే గ్రామీణ విద్యార్థులకు మంగళవారం స్థానిక కొత్తబస్టాండులో జరిగిన కార్యక్రమంలో సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ ఉచిత బస్సు పాసులు పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఇన్‌చార్జిలు సారయ్య, రాంరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి

- టీఆర్టీఎఫ్ జిల్లా ప్రతినిధి నందికొండ విద్యాసాగర్

చందుర్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని టీఆర్టీఎఫ్ జిల్లా ప్రతినిధి నందికొండ విద్యాసాగర్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో టీఆర్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు ప్రకటించి పూర్తిచేయాలని కోరారు. పీఆర్సీ కమిటీని వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. భద్రత లేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ బాధ్యులు బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, రమేశ్, లక్కే లక్ష్మీరాజ్యం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.